క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



రూరల్ ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు రూరల్ ఎస్‌ఐగా వెంకటసుబ్బయ్య శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. జూపాడుబంగ్లా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఈయనను ఉన్నతాధికారులు నందికొట్కూరు రూరల్‌కు బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు.

తాగునీరు కలుషితం

జూపాడుబంగ్లా: పైపు లీకేజీ కావటంతో తాగునీరు కలుషితం అవుతోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. నూతన ఆసుపత్రి నిర్మాణం వద్ద పాఠశాలలకు సరఫరా అయ్యే తాగునీటి పైపు లీకేజీ కావటంతో నీరు వృథా కావటంతో పాటు కలుషితం అవుతోంది. ఈ నీటిని తాగితే విరోగాలబారిన పడే అవకాశం ఉన్నందున సత్వరమే అధికారులు తాగునీటి పైపునకు మరమ్మతులు చేయించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

కొత్తపల్లి: జిల్లాస్థాయి క్రీడాపోటీలకు స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు ఎంపికయ్యారు. శుక్రవారం కేజీబీవీలో విద్యార్థినులను ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణబాయి ఉపాధ్యాయినులతో కలిసి అభినందించారు. నియోజకవర్గ స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో తమ విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనపరిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్న, ఉపాధ్యాయులు రామలక్ష్మి, నాగమణి, పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

నందికొట్కూరు రూరల్: మండలం పరిధిలోని గ్రామాల్లో శనివారం నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శోభారాణి శుక్రవా రం తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల లో ప్రజలకు అన్ని వసతులు ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పురుగు మందుతాగి వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన ఖాజాహుసేన్(33) పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ మారుతీశంకర్ శుక్రవారం తెలిపారు. ఖాజాహుసేన్ తాగుడుకు అలవాటుపడి కుటుంబాన్ని పట్టించుకోకపోవటంతో అతని భార్య విడాకులు తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై గురువారం రాత్రి మద్యంలో పురుగు మందు కలుపుకొని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యులు చికిత్స చేస్తుండగా మృతిచెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి అబ్దుల్‌రావూఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అలరించిన సంప్రదాయ నృత్యప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణమాఢవీధిలోని నిత్యకళావేదికపై శ్రీశైలంప్రాజెక్టుకు చెందిన ఉషా శివ డ్యాన్స్ అకాడమీ వారు సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. కార్యక్రమంలో మహాగణపతిం, శివపాదమంజీరనాదం, శివపంచాక్షరీస్తోత్రం, దేవిస్తుతి, అర్థనారీశ్వర శతకం, అఖిలాండేశ్వరి తదితర గీతాలకు శ్రావణి, మౌనిక, యశస్వి, హేమలత, సాయిలక్షిత, మౌనిక తదితరులు నృత్యం ప్రదర్శించారు.

వైభవంగా మహానందీశ్వరుడి పల్లకీసేవ



స్వామి వారి పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో వెలిసిన శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి,అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాకారంలో ఉత్సవం కన్నులపండుగగా చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు పల్లకీ ఉత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు.

ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కాంతారావునాయక్



ఎంపీడీఓ, డాక్టర్లతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కాంతారావునాయక్

పాములపాడు: ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కాంతారావు నాయక్ అన్నారు. తుమ్మలూరు గ్రామంలో శనివారం నిర్వహించబోయే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు ఏర్పాటుకు నిర్ణయించిన పాఠశాల గదులు, ఆవరణాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపు పట్ల నిర్లక్ష్యంగా ఉండరాదని వైద్య సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ గోపీకృష్ణ, డాక్టర్లు నాగలక్ష్మి దేవి, గులాబ్‌షా, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, సీహెచ్‌ఓ అన్నమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, సూపర్‌వైజర్లు మద్దయ్య, ఆనందమ్మ, రవికుమార్, పంచాయతీ కార్యదర్శి పుల్లయ్య తదితరులు ఉన్నారు.

● ఎంపీడీఓ గోపీకృష్ణ తన కార్యాలయంలో మాట్లాడుతూ శనివారం తుమ్మలూరు, అక్టోబర్ 3న చెలిమిల్ల, 4న జూటూరు, 5న ఇస్కాల, 6న రుద్రవరం, 7న వేంపెంట, 10న బానుముక్కల, 11న మిట్టకందాల, 12న మద్దూరు, 13న బానకచెర్ల, 16న యర్రగూడూరు, 17న వానాల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

సురక్ష క్యాంపును జయప్రదం చేయండి

కొత్తపల్లి: దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును జయప్రదం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ప్రోగ్రామ్ ఆఫీసర్ కాంతారావు సూచించారు. శుక్రవారం దుద్యాల గ్రామంలో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహణ స్థలాన్ని ఎంపీడీఓ మేరితో కలసి పరిశీలించారు. ఎక్కడెక్కడా ఏఏ పరికరాలు అమర్చాలి, ఏఏ ఆరోగ్య పరీక్షలు ఎక్కడా చేయాలి, ఎంతమంది వైద్యసిబ్బంది అవసరమో అన్ని స్థితిగతులను పరిశీలించారు. అధికారులందరూ ప్రజలకు అవగాహన కల్పించి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. గ్రామంలో 500 మంది వివిధ వ్యాధిగ్రస్తులకు చికిత్స నిమిత్తం టోకన్లు ఇచ్చామన్నారు. టోకెన్ తీసుకున్న ప్రతిఒక్కరూ తప్పకుండా ఆరోగ్య సురక్ష క్యాంపులో పాల్గొని చికిత్స చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వినోద్‌కుమార్, దీపానాగవేణి, సీహెచ్‌ఓ బాలకృష్ణ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్, డాక్టర్

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నందికొట్కూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిశోర్, అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ షైనీ ప్రయాంక సూచించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని రకాల రోగాలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వచ్చే నెల 30వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఉంటుందన్నారు.

సమన్వయంతో విజయవంతం చేయాలి

జూపాడుబంగ్లా: అధికారులు సమన్వయంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, జూపాడుబంగ్లా, పారుమంచాల పీహెచ్‌సీల వైద్యులు మాట్లాడుతూ నిర్ణీత తేదీల వారీగా ఆయా గ్రామాల్లో నిర్వహించే శిబిరాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. సమావేశంలో డాక్టర్లు యశశ్విని,గంగాధర్, సభా, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి పాల్గొన్నారు.

అక్టోబర్ 3 నుంచి 31వ తేదీ వరకు ..

మిడుతూరు: జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్‌ను శుక్రవారం ఎంపీడీఓ జీఎన్ఎస్ రెడ్డి విడుదల చేశారు. అక్టోబర్ 3 నుంచి 31 వ తేదీ వరకు మండలంలో కొనసాగుతుందనాన్రు. 3 న చింతలపల్లి, 5న దేవనూరు, 7న జలకనూరు, 10న చెరుకుచెర్ల, 12న మాసపేట, 18న అలగనూరు, 19న చౌట్కూరు, 21న తిమ్మాపురం, 25న మిడుతూరు-1 సచివాలయం, 26 న మిడుతూరు-2 సచివాలయం, 28న నాగలూటి, 31న వీపనగండ్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఉంటాయన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లోని బుక్కాపురం, ఏ.కోడూరు గ్రామాల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు శివనాగజ్యోతి, వాసుదేవగుప్త తెలిపారు. శుక్రవారం వారు ఏర్పాట్లును పర్యవేక్షించారు.

● వెలుగోడు: స్థానిక 3వ సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ లాలం రమేష్ తెలిపారు.

పూర్ణాహుతితో ముగిసిన చాతుర్మాస్య దీక్ష



వాసవి సత్రంలో హోమానికి పూర్ణాహుతి ద్రవ్యాలను సమర్పిస్తున్న బాలస్వామీజీ

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని వాసవీ సత్రంలో జూలై 3న పూజ్య శ్రీపజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) చేపట్టిన అర్ధచాతుర్మాస్య దీక్ష శుక్రవారం పూర్ణాహుతితో ముగిసింది. దీక్షలో భాగంగా ప్రతి రోజు వేకువజామున 108 శాలిగ్రామాలకు పూజ, తిరుమంజనం, తులసి అర్చన, చంద్రమౌళీశ్వర ఆరాధన, మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థఘోష తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు.

సత్య ధర్మాలు జీవితానికి శోభనిస్తాయి



వెంగళరెడ్డిపేటలో గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం,



కుంకుమార్చన పూజల్లో మహిళలు

మహానంది: సత్యధర్మాలు జీవితానికి శోభనిస్తాయని, అసత్య, అధర్మాలు క్షోభను కలిగిస్తాయని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లాల కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం వెంగళరెడ్డిపేటలో ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం గోపూజ, కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు. మూడు రోజులుగా శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతపై ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె సోమశేఖర్‌రెడ్డి, నాగమణి, అర్చకులు సదాశివరావు, పల్లె సుధాకర్‌రెడ్డి, కృష్ణవేణి, చిన్నవెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో సీపీడీసీఎల్ చైర్మన్



సీపీడీసీఎల్ చైర్మన్ పద్మజనార్దన్‌కు మెమొంటో ఇస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ పద్మజనార్దన్ శుక్రవారం మహానందికి వచ్చారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చైర్మన్ పద్మజనార్దన్, ఉన్నతాధికారులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. పూజల అనంతరం స్థానిక అలంకార మండపంలో వారికి ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వామి, అమ్మవార్ల ప్రసాదాలు, మెమంటో అందించి వేదాశీర్వచనం చేయించారు. కార్యక్రమంలో డీఈ సతీష్, ఏఈ ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే జెడ్పీ మాజీ చైర్మన్ లబ్బి వెంకటస్వామి స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

ప్రత్యేక నిధులతో పట్టణాభివృద్ధికి కృషి

● మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



హాజరైన మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు

నందికొట్కూరు: ప్రత్యేక నిధులతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో పట్టణ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వెనుకబడిన కాలనీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తెచ్చారన్నారు. ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, డీఈ నాయబ్ రసూల్, టీపీఓ బాలమద్దయ్య, హౌసింగ్ ఏఈ అరుణ్, కౌన్సిలర్లు హమీద్‌మియ్య, చాంద్‌బాషా, రవూఫ్, అశోక్, సురేష్, లాలుప్రసాద్, నాయబ్, క్రిష్ణ, చిన్నరాజు, శాతంకుమారి, విజయమ్మ, రాధిక, సమీరభాను, చింత లక్ష్మిదేవి, వాణి, జయమ్మ, గుర్రాల లక్ష్మిదేవి, కరీష్మా, రేష్మా, రూపాదేవి, క్రిష్ణవేణమ్మ, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాస రెడ్డి, గఫార్, మెహ్మా శాంతకుమారి పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ



అమ్మవారికి ఊయలసేవ నిర్వహిస్తున్న ఆలయ అధికారి, అర్చకులు

శ్రీశైలం టెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు దంపతులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

● నలభై ఏళ్లకు కొత్త సిద్ధేశ్వరం-పారుమంచాల రోడ్డుకు మోక్షం

● ముమ్మరంగా 5.3 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మాణం పనులు



కొత్తసిద్ధేశ్వరం-పారుమంచాల మధ్యన సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: నాలభై ఏళ్ల తర్వాత కొత్త సిద్ధేశ్వరం-పారుమంచాల గ్రామాల మధ్యన రోడ్డు నిర్మిస్తుండటంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రూ.5.08 కోట్ల ఏపీఆర్ఆర్‌పీ నిధులతో 5.03 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్డు ఐదేళ్ల క్రితం మంజూరైంది. పనులు దక్కించుకున్న మేఘా కంపెనీ మరో కంపెనీకి సబ్‌కాంట్రాక్టు ఇచ్చింది. వారు సకాలంలో పనులు పూర్తిచేయకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేయటంతో రెండు పర్యాయాలు ప్రభుత్వం నుంచి పనులు వాయిదావేస్తూ అనుమతులు పొందినట్లు తెలిపారు. వాస్తవానికి ఈ ఏడాది జూన్ మాసానికి రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాల్సి ఉండగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. జిల్లా అధికారులు ఒత్తిడిమేరకు పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ ఇప్పటిదాకా 1.5 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తిచేసినట్లు డీఈ లక్ష్మీనారాయణ తెలిపారు. మరో రెండు మాసాల్లోగా పనులు పూర్తయ్యేలా చూస్తామని డీఈ తెలిపారు.

భక్తుల బ్యాగులు చోరీ

● భక్తుల వాహనాలే టార్గెట్‌గా ముఠా

● గతంలో అయ్యప్పల ఇరుముడులు చోరీ

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు వాహనాల్లో వెళ్తుండగా గుర్తు తెలియని దుండగులు బ్యాగులు ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన కొందరు భక్తులు మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చారు. దర్శనం చేసుకుని వాహనాల్లో వెళ్తుండగా మహానంది నుంచి గాజులపల్లె వెళ్లే మార్గంలో దుండగులు వాహనాల మీద ఉన్నవాటిని ఎత్తుకెళ్లారని ఆవేదన చెందారు. ఈ మార్గంలో అడుగడుగునా గుంతలు ఉండటంతో నిదానంగా వెళ్లాల్సి ఉంటుంది. ఇదే అదనుగా భావించిన దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శించారు. రెండ్రోజుల క్రితం కొందరు భక్తుల బ్యాగులు చోరీకి గురయ్యాయి. గతంలోనూ అయ్యప్పస్వామి భక్తుల బస్సుపైన, వెనుక ఉన్న బ్యాగులు, ఇరుముడులను దొంగలు ఎత్తికెళ్లిన విషయం తెలిసిందే. ఈ మేరకు బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో విచారణ చేస్తున్నారు.

ఈ-క్రాప్ నమోదుకు నేడు చివరి అవకాశం

వెలుగోడు: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేసుకోవడానికి శుక్రవారంతో గడువు పూర్తి కానుందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం పలు పంటలను ఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 13,536 ఎకరాల సాధారణ విస్తీర్ణం ఉండగా 12,245 ఎకరాలు పంట సాగు చేశారని తెలిపారు. ఇప్పటికి 12,178 ఎకరాలు 98 శాతం ఈ-పంట నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే మండలానికి 30 క్వింటాళ్ల పప్పు శనగ విత్తనాలు మంజూరు అయినట్లు చెప్పారు. పప్పుశనగ జె.జి11 రకం క్వింటాల్ ధర రూ. 8100, సబ్సిడీ- 3240, రైతు వాటా- 4860, అనగా 40 శాతం సబ్సిడీతో పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో సూచించారు.

బాల్య వివాహాలు నేరం

మిడుతూరు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వీపనగండ్ల గ్రామంలో సర్పంచ్ చందాపురం భారతి, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ అక్కడక్కడా బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

బొమ్మలసత్రం: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి ఎస్పీ వినతులు సమర్పించారు.

● మత్స్యశాఖ భూమి మాయం!



మత్స్యపరిశ్రమ పక్కనే ఉన్న భూమిని చదును చేసి నాటిన మామిడి మొక్కలు

జూపాడుబంగ్లా: కళ్లెదుటే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునేనాథుడే కరువయ్యారు. తంగడంచ ఫారం ఏడీఏ కార్యాలయానికి సమీపంలో ఉన్న మత్స్యశాఖకు చెందిన రెండెకరాల భూమిని ఆక్రమించి చదును చేసి అందులో మామిడి మొక్కలు నాటారు. ఇంత జరుగుతున్నా ఫారం అధికారులు, మత్స్యశాఖ అధికారులెవ్వరూ అటువైపు కన్నెత్తిచూసిన దాఖలాల్లేవు. 1990లో సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో మత్స్యశాఖ పరిశ్రమను స్థాపించారు. పదేళ్ల పాటు మత్స్యశాఖ అధికారులు చేపపిల్లలను ఉత్పత్తి చేసేవారు. అధికారులు పట్టణజీవనానికి అలవాటుపడటంతో పాటు 2010 వరకు పరిశ్రమలను ఇతరులకు లీజుకు ఇచ్చారు. అనంతరం మత్స్యశాఖ అధికారులు పరిశ్రమలను విస్మరించటంతో నిరుపయోగంగా మారింది. ఇదే అదునుగా భావించి కొందరు మత్స్యపరిశ్రమలోని పెద్ద పెద్ద మోటార్లు చోరీ చేశారు. అయినా అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి పరిశ్రమ భూములను చదునుచేసి మామిడిచెట్లను నాటినా ఇదేంటని అడితే నాథుడే లేరు. ఈ విషయమై ఫారం ఏడీఏ అరుణలతను వివరణ కోరగా మత్స్యపరిశ్రమ ఏర్పాటుచేసిన భూములు ఇంకా మత్స్యశాఖ పరిధిలోనే ఉన్నాయని, ఫారం అధికారులకు హ్యాండవర్ చేసిన దాఖలు లేవని చెప్పారు. మత్స్యశాఖ నంద్యాల జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డిని వివరణ కోరగా విషయం తమకు తెలియదని, సిబ్బందిని పంపించి భూములను ఆక్రమించిన వారి వివరాలు తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సేవలకు గుర్తింపు

● వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం



గొల్ల రవియాదవ్



తువ్వ లోకేష్‌రెడ్డి



పుల్యాల నాగిరెడ్డి



తోకల కృష్ణారెడ్డి



రామలింగేశ్వర రెడ్డి



కె.సుధాకర్ రెడ్డి



మన్సూర్

నందికొట్కూరు: కష్టపడి పనిచేసిన కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ గుర్తించింది. పార్టీ అభివృద్ధికి కృషిచేసిన వారికి పదవులు కట్టబెట్టింది. మండల, పట్టణ అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. జూపాడు బంగ్లా మండల అధ్యక్షుడిగా తోకల కృష్ణారెడ్డి, కొత్తపల్లి మండల అధ్యక్షుడి కె.సుధాకర్‌రెడ్డి, నందికొట్కూరు మండల అధ్యక్షుడిగా జి.రవియాదవ్, పగిడ్యాల మండల అధ్యక్షుడిగా పి.నాగిరెడ్డి, మిడుతూరు మండల అధ్యక్షుడిగా తువ్వ లోకేష్‌రెడ్డి, పాములపాడు మండల అధ్యక్షుడిగా రామలింగేశ్వరరెడ్డి, నందికొట్కూర్ పట్టణ అధ్యక్షుడిగా షేక్ మన్సూర్ అమీద్‌లను పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు కేంద్ర పార్టీ కార్యాలయం పేర్కొంది.

శ్రీశైలం నియోజకవర్గంలో..



గుండయ్య యాదవ్



కొమ్మా మహేశ్వరరెడ్డి



బారెడ్డి శ్రీనివాసరెడ్డి

శ్రీశైలం ప్రాజెక్ట్/మహానంది: నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన పలువురిని పదవులు వరించాయి. శ్రీశైలం మండల అధ్యక్షుడిగా గుండయ్య యాదవ్, మహానంది మండల అధ్యక్షుడిగా కొమ్మా మహేశ్వరరెడ్డి, బండిఆత్మకూరు మండల అధ్యక్షుడిగా బారెడ్డి శ్రీనివాసరెడ్డిలను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

నిరుద్యోగుల జీవనోపాధికి చర్యలు

జూపాడుబంగ్లా: నిరుద్యోగ యువతీ, యువకులతో పాటు గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్న వారికి రుణాలిచ్చి వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెటర్నరీ ఏడీ రామాంజనేయనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకంలో అనుభవం కలిగి ఆసక్తి ఉన్న వారికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రుణాలిస్తున్నట్లు తెలిపారు. కోళ్ల పెంపకంపై ఆసక్తి ఉన్న వారికి 50 శాతం రాయితీతో రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు రుణాలిస్తున్నట్లు తెలిపారు. పందుల పెంపకం దారులకు రూ.15 లక్షల నుంచి రూ.60లక్షల వరకు 50శాతం రాయితీతో రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అలాగే సైలేజీ గడ్డి తయారీ, పశుగ్రాస దిమ్మెల తయారీ, సమీకృత దాణాతయారీ యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తూ యూనిట్లను ఏర్పాటుచేసుకోదలచిన వారికి 50శాతం రాయితీతో రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు రుణసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ రుణాలను రైతు ఉత్పాదక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపుల్లో సభ్యత్వం కలిగి పశుపోషణ, గొర్రెలు, మేకలు, పందుల పోషణ, దాణాతయారీలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యతను అనుసరించి రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30న నంద్యాలలో జరిగే అవగాహన సదస్సుకు హాజరై అవగాహన చేసుకొని రుణాలు పొంది ఉపాధిరంగాల్లో రాణించాలని ఏడీ రామాంజనేయనాయక్ తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు, పశుపోషకులు, గొర్రెలు, మేకలు, పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన అహోబిలం పీఠాధిపతి చాతుర్మాస్య దీక్ష



దీక్ష విరమించిన పీఠాధిపతి రంగరాజ యతీంద్ర మహాదేశికన్

ఆళ్లగడ్డ: లోక కల్యాణార్థం అహోబిలం మఠం పీఠాధిపతి శ్రీమాన్ శఠగోప రంగరాజ యతీంద్ర మహాదేశికన్ స్వామీజీ చేపట్టిన చాతుర్మాస్య దీక్ష శుక్రవారం ముగిసింది. ఉదయం దిగువ అహోబిలం ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి అనంతరం శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఛత్ర చామర వాద్య దివిటి సహితంగా సన్నిధి వీధిలోని మఠం చేరుకున్న పీఠాధిపతి మాలోల నరసింహ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం దీక్ష విరమించిన పీఠాధిపతిని వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన అర్చకులు, శిష్యులు ఘనంగా సత్కరించారు.

అహోబిలేశుని సేవలో..

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ఎపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ పద్మ జనార్థన్‌రెడ్డి శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాలను దర్శించుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ మర్యాదల్లో బాగంగా స్వామి తీర్థ ప్రసాదాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈయన వెంట ఆళ్లగడ్డ ఏడీఈ రవికాంత్ చౌదరి ఉన్నారు.